సాక్షి
ఖమ్మం

శనివారం । 3 । మే । 2025





## 'కగార్' నిలిపివేయండి

మావోల నిర్మూలన పేరిట నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపేసి శాంతిచర్చలు జరపాలని పలువురు డిమాండ్ చేశారు. 10లో



## చేతుల కాలకముందే...

ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల హోర్డింగ్‌లు ప్రమాదకరంగా మారినందున అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
39° / 27°

## వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం, రాత్రి ఉష్ణోగ్రత కాస్త తగ్గే అవకాశముంది. మధ్యాహ్నం మాత్రం ఎండ ప్రభావం ఉంటుంది.

# ఇదే సరైన సమయం



శిథిలావస్థకు చేరిన ఖమ్మం ముస్తఫానగర్‌లోని బీసీ హాస్టల్

### హాస్టళ్లకు సెలవుల వేళ మరమ్మతులకు అనువు

- జిల్లాలోని పలు వసతిగృహాల్లో సమస్యల తిష్ట
- ప్రతిపాదనల మేరకు నిధులు మంజూరైతే మేలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలకు సంబంధించి పలుచోట్ల భవనాలు సమస్యలతో కునారిల్లుతున్నాయి. కొన్ని భవనాలు దెబ్బతినగా.. ఇంకొన్ని శిథిలావస్థకు చేరాయి. భవనాల పైకప్పులకు లీకేజీలు, పెచ్చులూడిన గోడలు, దెబ్బతిన్న కిటికీలు, ఊడిపోయిన విద్యుత్ వైర్లు.. ఇలా అనేక సమస్యలు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అయితే, కొన్ని శాఖల భవనాల మరమ్మతులకు అధికారులు అంచనాలు రూపొందించగా, ఇంకొన్ని శాఖల్లో ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం వేసవి సెలవులు కొనసాగుతున్నందున త్వరగా నిధులు కేటాయించి పనులు చేపడితే విద్యాసంవత్సరం మొదలయ్యే నాటికి భవనాలు సిద్ధమయ్యే అవకాశముంది.

**మరమ్మతులకు ప్రతిపాదనలు, మంజూరు**

| శాఖ, హాస్టళ్లు | నిధులు |
|---|---|
| బీసీ హాస్టళ్లలో మరమ్మతులు | రూ.20.10 లక్షలు |
| ఎస్సీ హాస్టళ్లలో మరమ్మతులు | రూ.2,42,11,000 |
| మూడు భవన నిర్మాణాలకు నిధులు | రూ.9 కోట్లు |

**జిల్లాలో మొత్తం వసతిగృహాల వివరాలు**

| సంక్షేమశాఖ | వసతిగృహాలు |
|---|---|
| బీసీ | 33 |
| ఎస్సీ | 52 |
| ఎస్టీ | 30 |

**రూ.20లక్షలతో మరమ్మతులకు ప్రతిపాదనలు..**

జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో మరమ్మతులకు రూ.20.10లక్షలు అవసరమని ప్రతిపాదించారు. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు సంబంధించి ఖమ్మంలోని బీసీ సీజీహెచ్‌లో పైకప్పు, గోడల మరమ్మతులు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల ఏర్పాటు, రీవైరింగ్, టాయిలెట్లు, బాత్‌రూమ్‌ల మరమ్మతులకు రూ.64 వేలు అవసరమని నివేదించారు. అలాగే, పాలేరు బీసీ సీజీహెచ్‌లో మరమ్మతులకు రూ.65వేలు, వైరా బీసీ సీజీహెచ్‌కు రూ.72 వేలు అవసరమని ప్రతిపాదించారు. ఇవి కాక ఇంకొన్ని హాస్టళ్లలో రూ.20.10లక్షలు అవసరమని ఉన్నతాధికారులకు నివేదించారు.

**దెబ్బతిన్న ఎస్సీ హాస్టళ్లు**

ఎస్సీ వసతి గృహాల్లో కూడా వసతులు సక్రమంగా లేవు. జిల్లాలో 52వసతి గృహాలు ఉండగా.. అందులో 49 ప్రభుత్వ భవనాల్లో, మిగతావి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అయితే, ఏ భవనంలో కూడా సరైన వసతులు లేనందున పరిష్కారంపై అధికారులు దృష్టి సారించారు. మొత్తంగా మరమ్మతులకు రూ.2,42,11,000 అవసరమని నివేదించగా.. నిధులు మంజూరైతే పనులు చేపట్టనున్నారు.

**మూడు హాస్టళ్ల నిర్మాణానికి నిధులు**

జిల్లాలో శిథిలావస్థకు చేరిన మూడు బీసీ సంక్షేమ వసతిగృహాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి బీసీ సంక్షేమశాఖ కమిషనర్ అనుమతించారు. ఆయా భవనాల్లో హాస్టళ్లనిర్వహణ ప్రమాదమని నిర్ధారించడంతో ఒక్కో హాస్టల్‌కు రూ.3 కోట్ల చొప్పున మూడింటికి రూ.9 కోట్లు మంజూరు చేశారు. ఖమ్మం ముస్తఫానగర్‌లోని బీసీ బాలుర హాస్టల్, జహీర్‌పురలో బీసీ బాలికల హాస్టల్, రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలోని బీసీ హాస్టళ్ల కొత్త భవనాల నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నారు.

### ఈ హాస్టళ్లలోనూ ఇబ్బందులే..

జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాల్లోనూ సమస్యలు వేధిస్తున్నాయి. మధిరలోని ఎస్టీహెచ్(షెడ్యూల్ ట్రైబ్ హాస్టల్), ముదిగొండ మండలం వల్లభిలోని ఆశ్రమ పాఠశాల, తిమ్మారావుపేట ఎస్టీహెచ్, ఖమ్మం, ఖమ్మంరూరల్ పోస్ట్‌మెట్రిక్ కాలేజీల్లో మరమ్మతులు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. అయితే, ఎక్కడెక్కడ ఏయే పనులు చేయాలో ఇంజనీరింగ్ అధికారులు నిర్ధారించాక ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నారు.

# సమ్మెకు సన్నద్ధం!

- ఈనెల 7నుంచి ఆర్టీసీలో సమ్మె చేస్తామని జేఏసీ ప్రకటన
- ఖమ్మం రీజియన్ పరిధిలో 2,012 మంది సిబ్బంది



చుంచుపల్లి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో మరోసారి సమ్మె సైరన్ మోగనుంది. ఈనెల 7 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ కొన్నాళ్ల క్రితం ప్రకటించింది. 2019లో ఆర్టీసీ కార్మికులు 54 రోజులపాటు సమ్మె చేపట్టారు. ఆ సమయంలోనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించినా ప్రక్రియ పూర్తికాలేదు. ఇక కార్మిక సమస్యలు పరిష్కారం, పీఆర్సీ బకాయిలు చెల్లింపు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చూస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్న ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు జేఏసీగా ఏర్పడి సమ్మెకు సిద్ధమయ్యారు. ఖమ్మం రీజియన్ పరిధిలో ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు ఆర్టీసీ డిపోలు ఉండగా.. 2,012 మంది ఉద్యోగులు, కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సమ్మె ఆలోచన చేయొద్దని సీఎం రేవంత్‌రెడ్డి సూచించిన నేపథ్యాన.. జేఏసీ బాధ్యులు చర్చలకు సిద్ధమవుతారా, లేక సమ్మెకు దిగుతారా అన్నది తేలాల్సి ఉంది.

**ప్రధానమైన డిమాండ్లు ఇవే..**

సమ్మె నిర్ణయాన్ని ప్రకటించిన జేఏసీ నాయకులు తమ డిమాండ్లను కూడా విడుదల చేశారు. ఇందులో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణ, 2017 వేతన సవరణ బకాయిల చెల్లింపు, కొత్త అలవెన్స్‌ల అమలు, 2021, 2025 వేతన సవరణలు, ఉద్యోగ భద్రత, సిబ్బందిపై పనిభారం తగ్గింపు, – ఆర్టీసీ అభివృద్ధికి ఏటా బడ్జెట్‌లో 3 శాతం నిధుల కేటాయింపు, ఎలక్ట్రిక్ బస్సులను కేంద్రం ప్రభుత్వం పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు, అర్హులకు పదోన్నతులు, కారుణ్య నియామకాలు వంటివి ఉన్నాయి. అలాగే, అద్దె బస్సులు, ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్లు, ఇతర సిబ్బందిని, అద్దె బస్సులను ఆర్టీసీలోకి తీసుకోవడం, పోలీసు కేసుల తొలగింపు, పీఎఫ్, సీసీఎస్ నుంచి యాజమాన్యం వాడుకున్న డబ్బును వడ్డీతో సహా చెల్లింపు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కన్సల్టెన్సీల పేరుతో ఉన్న వారి తొలగింపు, మహిళా కండక్టర్లతో పాటు ఉద్యోగుల సమస్యలు పరిష్కారం తదితర డిమాండ్లు జేఏసీ ప్రకటించిన జాబితాలో ఉన్నాయి.

### సమస్యల పరిష్కారానికే..



కార్మికులకు రావాల్సిన అన్ని రకాల బకాయిలు చెల్లించడం తోపాటు ప్రధానమైన సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మెబాట పడుతున్నాం. పలుదఫాలు ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం దక్కలేదు.

– కందుల భాస్కరరావు,
ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

### అంగన్‌వాడీలకు తీపి కబురు...

తొలిసారిగా 'టేక్ హోం రేషన్'



ఖమ్మంవన్‌టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వేసవిలో సిబ్బందికి సెలవులు ఇవ్వడమే కాక 1972లో అంగన్‌వాడీ వ్యవస్థ ఏర్పాటయ్యాక తొలిసారి 'టేక్ హోం రేషన్'కు అనుమతి ఇస్తూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో తమకు ఎండ నుంచి ఉపశమనం లభిస్తుందని సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ కేంద్రాలకు సెలవులు ఇచ్చినా టీచర్, ఆయా పదిహేను రోజుల చొప్పున విధులు నిర్వర్తిస్తూ లబ్ధిదారులకు పౌష్టికాహారం వండి వడ్డించాల్సి వచ్చేది. కానీ ఈసారి బియ్యం, పప్పు, వంటనూనె, గుడ్లు, పాలు నెలకు సరిపడా ఒకేసారి పంపిణీకి అనుమతించారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వేసవి సెలవులు వర్తిస్తాయి. అయితే, రేషన్ సామగ్రి పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా సీడీపీఓలు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పర్యవేక్షించాలని ప్రభుత్వం ఆదేశించింది.

### అటు కాదు.. ఇటు!



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా వేసినా లారీల కొరతతో మిల్లులకు తరలింపులో జాప్యం జరుగుతోంది. ఇంతలోనే అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారు. దీంతో అధికారులు నేరుగా రంగంలోకి దిగారు. కూసుమంచి తహసీల్దార్ కరుణశ్రీ, ఎస్సై నాగరాజు ఆధ్వర్యాన శుక్రవారం జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న ఖాళీ లారీలను కొనుగోలు కేంద్రాలకు పంపించి.. అక్కడి నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. – కూసుమంచి

# సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం



సింథటిక్ ట్రాక్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురాంరెడ్డి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు, ప్రజాప్రతినిధులు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురాంరెడ్డి
- స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన

ఖమ్మం స్పోర్ట్స్: ఏ రంగంలోనైనా అభివృద్ధి ఒక్కరితో సాధ్యం కాదని, సమష్టి కృషి కీలకమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్, టేబుల్ టెన్నిస్ హాల్ నిర్మాణానికి శుక్రవారం ఆయన ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశాక మాట్లాడారు. పటేల్ స్టేడియంలో శిక్షణ పొందిన ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగారని.. వారికి మరిన్ని సౌకర్యాలు సమకూర్చేలా కృషి చేస్తానని తెలిపారు. సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ 8.50 కోట్లు, టేబుల్ టెన్నిస్ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. కాగా, క్రికెట్ శిక్షణకు 20 ఎకరాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను ఆదేశించారు. ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ సింథటిక్ ట్రాక్‌తో క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ అందుతుందని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి మాట్లాడగా ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుట్టా శంకరయ్య, క్రిస్టోఫర్‌బాబు, కోచ్‌లు, క్రీడాసంఘాల బాధ్యులు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, నున్నా రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, షఫీక్ అహ్మద్, కర్నాటి వీరభద్రం, చంద్రశేఖర్, ఆదర్శ్‌కుమార్, వీవీఎస్.మూర్తి, ఎం.డీ.మతిన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం కప్ పోటీల్లో విజేతలకు మంత్రి, ఎంపీ పతకాలు అందజేయగా.. వేసవి శిబిరంలో బ్యాడ్మింటన్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు అసోసియేషన్ తరఫున టీషర్ట్‌లు అందజేశారు.

# విపత్తు నివారణకు ముందస్తు ప్రణాళిక



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, అధికారులు

- యువతకు 'ఆపదమిత్ర'లుగా శిక్షణ
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్

ఖమ్మం సహకారనగర్: విపత్తులు ఎదురైనప్పుడు ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముందస్తు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, మునిసిపల్ తదితర శాఖల అధికారులతో భారీ వర్షాలు, వరదలు ఎదురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నష్టం ఎదురుకాకుండా జాగ్రత్తలు పాటించాలని, గతంలో ముంపునకు గురైన ప్రాంతాలపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే, 'ఆపదమిత్ర'లుగా గ్రామీణ ప్రాంతాల్లో 139, పట్టణ ప్రాంతాల్లో 161 మంది యువతను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడంతో పాటు బీమా చేయించాలని తెలిపారు. కాగా, ముంపు ప్రాంత ప్రజలు విలువైన వస్తువులను భద్రపర్చుకునేలా ముందుగానే అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్ట్యా ప్రతీ శాఖ నుండి ఒక నోడల్ అధికారిని నియమించి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడగా, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీవో సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులుపాల్గొన్నారు.

**భూగర్భ డ్రెయినేజీ పనుల్లో వేగం**

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మంలో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ అమృత్–2 ద్వారా రూ.249.5 కోట్లతో భూగర్భ డ్రెయినేజీ నిర్మిస్తుండగా, డ్రెయినేజీ లైన్ 8.5 కి.మీల్లో1.54 కి.మీ. పూర్తయిందన్నారు. మిగతా పనులతో పాటు మ్యాన్ హోల్స్, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణంపై దృష్టి సారించాలని తెలిపారు. ఈసమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్‌తో పాటు డీఇ, ఏఈలు పాల్గొన్నారు.

**భూ భారతి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి**

ఖమ్మం సహకారనగర్: భూ భారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో కలిసి ఆయన హైదరాబాద్‌నుంచి వివిధ అంశాలపై సమీక్షించారు. పైలెలట్ ప్రాజెక్టు కింద ఎంపి చేసిన మండలాల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, హైకోర్టు నుంచి అనుమతి వచ్చాక సాదాబైనామా దరఖాస్తులపై దృష్టి సారించాలని తెలిపారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ ఏర్పాట్లపై సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ నేలకొండపల్లి మండలంలో 3,224 దరఖాస్తులు రాగా, తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. సీపీ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, ఎస్‌డీసీ రాజేశ్వరి, ఆర్డీఓలు నర్సింహారావు, ఎల్.రాజేందర్, హౌసింగ్ ఈఈ భూక్యా శ్రీనివాస్, డీపీఓ ఆశాలత, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి ప్రకోపం

- ఈదురుగాలులు, అకాల వర్షంతో పంటలకు నష్టం
- 107 ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

ఖమ్మంవ్యవసాయం: ప్రకృతి పంజా విసురుతోంది. యాసంగి పంటలు చేతికి అందుతున్న వేళ ఈదురుగాలులు, అకాల వర్షాలతో రైతులు నష్టపోతున్నారు. జలాశయాల్లో సమృద్ధిగా నీరు ఉండటంతో జిల్లాలోని 2.30 లక్షల ఎకరాల్లో వరి, 1.15 ఎకరాల్లో మొక్కజొన్నతో పాటు అపరాలు, ఉద్యాన పంటలను సాగు చేశారు. ఈ పంటలన్నీ చేతికందుతుండగా ప్రకృతి వైపరీత్యాలతో నష్టం ఎదురవుతోంది. గురువారం అర్ధరాత్రి దాటాక జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. దీంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్నలు తడిసి ముద్దయ్యాయి. ఈమేరకు జిల్లాలోని 107 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. రఘునాథపాలెం, కారేపల్లి మండలాల్లో నష్టప్రభావం ఉండగా, మామిడి 30 ఎకరాల్లో, బొప్పాయి 65 ఎకరాల్లో, మునగ 12 ఎకరాల్లో దెబ్బతిందని తేల్చారు. కల్లూరు, తల్లాడ, వైరా మండలాల్లో 1,776 మంది రైతులకు చెందిన వరి, మొక్కజొన్న పంటలు 3,212 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు గుర్తించారు.

**నేలకొండపల్లిలో అత్యధికం**

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం అర్ధరాత్రి వర్షం కురిసింది. అధికంగా నేలకొండపల్లి మండలంలో 31.4 మి.మీల వర్షపాతం నమోదైంది. అలాగే, ఖమ్మం అర్బన్‌లో 9.4, కూసుమంచిలో 9.2, ఖమ్మం రూరల్‌లో 8.6, తిరుమలాయపాలెంలో 7.8, రఘునాథపాలెంలో 4.8, బోనకల్లు 3, కొణిజర్ల 2.2, సత్తుపల్లి 1.8, చింతకాని 1.4, ముదిగొండలో 1.2, మి.మీ.ల వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.



దెబ్బతిన్న బొప్పాయి తోటలో పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, ఎంపీ తదితరులు

### పంట మార్పిడితో నష్టాల నివారణ

రఘునాథపాలెం: అకాల వర్షాలతో రైతులకు ఎదురవుతున్న నష్టాలను పంట మార్పిడి విధానంతో తగ్గించవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతులు ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. రఘునాథపాలెం మండలం సూర్యతండాలో అకాల వర్షం, ఈదురు గాలులతో దెబ్బతిన్న బొప్పాయి తోటలను ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి మంత్రి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఇప్పటి వరకు సుమారు 25వేల ఎకరాల్లో పంట నష్టం జరగగా.. మిర్చి, బొప్పాయి, మొక్కజొన్నల పంటలు ఇందులో ఉన్నాయని తెలిపారు. అయితే, ప్రభుత్వం నుంచి సాయం అందించనున్నప్పటికీ, అది పరిమితంగానే ఉంటున్నందున, రైతులు కాలానుగుణంగా పంటలు ఎంచుకోవాలని సూచించారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎం.వీ.మధుసూదన్, డీఏఓ పుల్లయ్య, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, నాయకులు వాంకుడోత్ దీపక్, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### నేడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన

ఖమ్మం వన్‌టౌన్/ముదిగొండ: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం ముదిగొండ మండలం పమ్మిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఆతర్వాత 11–30గంటలకు బాణాపురం ఎస్సీ కాలనీ నుండి మంగాపురం వరకు బీటీ రోడ్డు, 12గంటలకు ముత్తారంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణం, ఒంటి గంటకు చిరుమర్రిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి భట్టి శంకుస్థాపన చేస్తారు. అలాగే, ముదిగొండ మండలంలోని పలు గ్రామాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

### ఈనెల 7వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఈనెల 7వ తేదీ వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్ ప్రమాదాల నివారణపై వినియోగదారులు, రైతులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు ఇస్తూ కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కాగా, భద్రతా వారోత్సవాలు జరుగుతుండగానే ప్రకృతిపరీత్యాలు, ఈదురుగాలులతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కారేపల్లి, ముదిగొండ మండలాల్లో తెగిన లైన్లకు విద్యుత్ సరఫరా అయి తొమ్మిది గేదెలు మృతి చెందగా, ఘటనకు సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని రైతులు ఆరోపించారు. ఈనేపథ్యాన వినియోగదారులు అప్రమత్తంగా ఉంటూ, తమ సూచనలు పాటించాలని ఎస్ఈ కోరారు.

### ప్రవేశాల పెంపునకు కృషి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఏన్కూరు/ఖమ్మం సహకారనగర్: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించేలా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు సూచించారు. ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ సీహెచ్.యాదగిరితో కలిసి శుక్రవారం ఆయన ఏన్కూరు జూనియర్ కళాశాలతో పాటు కామేపల్లి, వైరా, ఖమ్మంలోని ప్రభుత్వ బాలికల కళాశాలను సందర్శించారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించి అధ్యాపకులకు సూచనలు చేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రచార కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ సింహాచలం, అధ్యాపకులు సుందర్, కృష్ణప్రసాద్, బాబులాల్, రామారావు, ఐ.వీ.రావు, విజయలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

### డీడీఎన్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంగాంధీచౌక్: ధూప దీప నివేదన(డీడీఎన్) పథకానికి అర్హత కలిగిన ఆలయాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన దేవాలయాలకు ఈ పథకాన్ని వర్తించేలా నోటిఫికేషన్ విడుదల చేయగా, దరఖాస్తులను శాఖ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని అవసరమైన ధ్రువపత్రాలను జతపరిచాక ఈనెల 24వ తేదీ నాటికి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ సహాయ కమిషనర్‌కు అందించాల్సి ఉంటుంది. ఆతర్వాత అర్హత సాధించిన ఆలయానికి నెలకు రూ.4వేలు ధూపదీప నైవేద్యం కోసం, అర్చకుడికి రూ.6 వేల గౌరవ వేతనం చెల్లిస్తారు. కనీసం పదిహేనేళ్ల క్రితం నిర్మించి, దేవాదాయ చట్ట ప్రకారం రిజిస్టర్ కావడంతో పాటు అర్చకుడి ద్వారా నిత్యపూజలు జరుగుతున్న ఆయాలను పరిగణనలోకి తీసుకుంటారు. మున్సిపల్ కార్పొరేషన్ కాకుండా గ్రామాలు, మున్సిపాలిటీల్లోని ఆలయాలకే వర్తిస్తుందని అధికారులు వెల్లడించారు. 2007లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో డీడీఎన్ పథకాన్ని ప్రారంభించగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 450 దేవాలయాలు ప్రస్తుతం జాబితాలో ఉన్నాయి.

### స్వర్ణ కవచధారణలో రామయ్య

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో ప్రత్యేక పూజల అనంతరం బేడా మండపంలో స్వామి, అమ్మవార్లను అలంకరించిన అర్చకులు నిత్యకల్యాణం జరిపారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు.

## క్లుప్తంగా

### 'రైతుల కష్టాలు కనిపించడం లేదా?'

కూసుమంచి: జిల్లా నుండి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు పట్టించుకోవడం లేదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ విమర్శించారు. మండలంలోని చేగొమ్మ, మల్లేపల్లిల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పరిశీలించిన ఆయన రైతుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సుదర్శన్ మాట్లాడుతూ కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండగా, అకాల వర్షంతో ధాన్యం తడిసిపోయిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోందని, మిల్లర్లు దిగుమతి చేసుకోవడం లేదని తెలిసినా ప్రభుత్వం పట్టించుకోకపవడం సరికాదని పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, నాయకులు మల్లెల హన్మంతరావు, తోటకూరి రాజశేఖర్, బిక్కసాని గంగాధర్, కర్ణబాబు, రవి, రాధాకృష్ణ, ప్రతాప్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

### కులగణన నిర్ణయం హర్షణీయం



పాలాభిషేకం చేస్తున్న రాజేందర్‌రెడ్డి, పువ్వాళ్ల తదితరులు

ఖమ్మంవన్‌టౌన్: దేశమంతటా కులగణన చేపట్టాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆలోచనలతో తెలంగాణలో చేపట్టిన గణన దేశమంతటా చేపట్టాలని నిర్ణయించారని వారు పేర్కొన్నారు. ఈమేరకు ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం పీసీసీ పరిశీలకుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ జోడోయాత్రలో చెప్పిన విధంగా కులగణన చేసి దేశానికే తెలంగాణ దిక్సూచిగా మారిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, పార్టీ జిల్లా పరిశీలకుడు బత్తిన శ్రీనివాసరావు, నాయకులు పులి అనిల్ కుమార్, నాగండ్ల దీపక్‌చౌదరి, కొత్తా సీతారాములు, పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్‌గౌడ్, బొడ్డు బొందయ్య,సయ్యద్ గౌస్, ముజాహిద్ హుస్సేన్, గజ్జెల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### న్యాయవాద సొసైటీ అధ్యక్షుడిగా రాజశేఖరరెడ్డి



సొసైటీ నూతన కార్యవర్గ బాధ్యులు

ఖమ్మం లీగల్: ఖమ్మం న్యాయవాద సంక్షేమ సంఘం ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ హాల్‌లో ఎన్నికలు నిర్వహించగా నాలుగు డైరెక్టర్ పదవులకు గాను 549 ఓటర్లలో 429 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈమేరకు ఆవుల అనురాధ 308ఓట్ల ఆధిక్యంతో, షేక్ నస్రీన్, 291, కాసర రాజశేఖరరెడ్డి 261, పాలవెల్లి వెంకటేశ్వర్లు 242 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారని ఎన్నికల అధికారి జి.రమేష్ ప్రకటించారు. అనంతరం గతంలో ఉన్న డైరెక్టర్లతో కలిపి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షుడిగా కాసర రాజశేఖరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా పిడతల రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శిగా బిళ్ల క్రాంతికుమారి, సంయుక్త కార్యదర్శిగా పలివెల శ్రీలక్ష్మి, కోశాధికారిగా భూక్యా రమేష్ ఎన్నికయ్యారు.

### ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయం



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని, ఇందుకోసం కేంద్రప్రభుత్వం పథకాలు అమలుచేస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. జనగణనలో భాగంగా కులగణన కూడా నిర్వహించాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యాన ఖమ్మంలో శుక్రవారం ప్రధాని మోదీకి కృతజ్ఞతలు చెబుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుడుతుంటే ఆ ఘనత కాంగ్రెస్‌దిగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజామద్దతుతో వారి సంక్షేమానికి అనేక పథకాలు అమలుచేసిన ఘనత కేంద్రప్రభుత్వానికి ఉందని తెలిపారు. ఈసమావేశంలో పార్టీ నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, ఈ.వీ.రమేష్, అల్లిక అంజయ్య, నున్నా రవికుమార్, జ్వాలా నర్సింహారావు, మేకల నాగేందర్, టీకుమల్ల వీరూగౌడ్, సుధాకర్, వీరవెల్లి రాజేష్, పమ్మి అనిత, రవిరాథోడ్, ఆర్‌వీఎస్.యాదవ్, రుద్రగాని మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# చేతులు కాలకముందే..

- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఇష్టారాజ్యంగా హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు
- కొన్నిచోట్ల అనుమతికి మించి.. ఇంకొన్ని చోట్ల అనధికారికంగా ఏర్పాటు
- సంస్థల నిర్లక్ష్యంపై దృష్టి సారించని యంత్రాంగం
- ముందస్తు చర్యలు తీసుకుంటేనే మేలు..





ఖమ్మంలోని స్టేడియం ఎదుట హోర్డింగ్‌పై చిరిగిపోయిన ఫ్లెక్సీ (ఇన్‌సెట్) సగం మేర చినిగి వేలాడుతున్న ఫ్లెక్సీలు

ఖమ్మంమయూరిసెంటర్: వివిధ కంపెనీలు, వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తుల ప్రచారానికి నగర, పురపాలికల్లో భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. ఈ క్రమంలో నిబంధనలు విస్మరించి, అనుమతికి మించి భారీస్థాయిలో ఫ్లైఓవర్ల వెంట, ఇతర రద్దీ ప్రాంతాలు, బైపాస్‌ల వెంట భవనాలపై ఏర్పాటు చేస్తుండడంతో భారీ ఈదురుగాలులు, వర్షాల సమయాన కూలిపడతాయోననే ఆందోళన వ్యక్తమవుతోంది. ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు సత్తుపల్లి, మధిర, వైరా, ఏదులాపురం, కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపాలిటీల్లో హోర్డింగ్‌ల సంఖ్య నానాటికీ పెరుగుతున్నా అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం.

**నిబంధనలు గాలికి..**

వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రకటన కోసం ప్రైవేట్ యాడ్ ఏజెన్సీలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అనుమతి తీసుకుని హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం భవన బేస్‌మెంట్ పిల్లర్లతో అనుసంధానంగా పటిష్టంగా పిల్లర్ నిర్మించి రాడ్లు బిగించాలి. అంతేకాక ఫ్లైఓవర్ల పక్కన కనీసం 10 మీటర్ల దూరంలోనే ఏర్పాటుచేయాలి. భవనాలపై హోర్డింగ్‌లు ఏర్పాటుచేశాక ఏటా పిల్లర్ల బలాన్ని పరిశీలించాలి. శిథిలావస్థకు చేరిన భవనాలు, పిల్లర్లపై హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడంపై నిషేధం ఉంది. అంతేకాక హోర్డింగ్‌లకు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు చిరిగితే గాలిలో వేలాడకుండా తాళ్లతో బిగించాలి. సగం మేర చినిగినా, ముక్కలైనా వెంటనే తొలగించాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా ఈ నిబంధనలు పాటించడం లేదు.

**పోటాపోటీగా ఏర్పాటు**

ఉమ్మడి జిల్లా వ్యాపార, వాణిజ్య రంగాల్లో దూసుకుపోతోంది. కొత్తగా పలు సంస్థల బ్రాంచ్‌లు ఏర్పాటవుతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రాల్లో వీటి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. వీటి మధ్య పోటీ కారణంగా జనాన్ని ఆకట్టుకునేందుకు ఒకరికి మించి ఒకరు భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ హోర్డింగ్‌ల ద్వారా వచ్చే ఆదాయాన్ని చూస్తున్న అధికారులు నాణ్యతను మాత్రం పట్టించుకోవడం లేదు.

**వీటికే అనుమతులు..**

ఖమ్మంలో సుమారు 300 వరకు హోర్డింగ్‌లు ఉన్నట్లు అంచనా. అయితే, అధికారికంగా 240 హోర్డింగ్‌లకే అనుమతి ఉంది. సత్తుపల్లిలో 25 వరకు హోర్డింగ్‌లుంటే 14కు, మధిరలో 14 ఉండగా.. నాలుగింటికే అనుమతి ఉంది. అలాగే, వైరాలో 20 హోర్డింగ్‌లు ఉండగా పన్నులు విధించిన దాఖలాలు లేవనే చెప్పాలి. ఏదులాపురంలో మూడు హోర్డింగ్‌లు ఉండగా దేనికీ అనుమతి లేనట్లు సమాచారం. కొత్తగూడెం మున్సిపాలిటీలో 25 హోర్డింగ్‌లు ఉండగా 16కు మాత్రమే అనుమతులు ఉన్నాయి. పాల్వంచలో ప్రధాన రహదారుల వెంట 15 హోర్డింగ్‌లు కనిపిస్తుండగా అన్నింటికీ అనుమతులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇల్లెందులో ఏడు హోర్డింగ్‌లకు గాను అన్నింటికీ అనుమతులు ఉన్నాయని రికార్డులు చెబుతున్నాయి. కానీ ఈ రెండు చోట్ల అనధికారికంగా పెద్దసంఖ్యలో హోర్డింగ్‌లు ఏర్పాటైనా అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఇక మణుగూరులో రెండు హోర్డింగ్‌లకు గాను దేనికీ అనుమతి లేకపోవడం గమనార్హం.

ఖమ్మంలోని ప్రధాన రహదారి వైరా రోడ్డుకు ఇరువైపులా భవనాలపై భారీ హోర్డింగ్‌లు ఉన్నాయి. వీటిపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అలాంటివేవీ పాటించకపోవడంతో ఫ్లెక్సీలు గాలికి చిరిగి వేలాడుతున్నాయి. ఇంకొన్ని చోట్ల ఫ్లెక్సీలు ఎగిరొచ్చి విద్యుత్ తీగలపై పడడంతో సరఫరాకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఇదికాక హోర్డింగ్‌లను పటిష్టంగా ఏర్పాటు చేయకపోవడంతో కూలిపడతాయేమోననే స్థానికుల్లో వ్యక్తమవుతోంది.



అశ్వారావుపేటలో ఇటీవల గాలిదుమారానికి కూలిన హోర్డింగ్

అశ్వారావుపేటలో మూడు హోర్డింగ్‌లు ఏర్పాటు చేయగా.. ఒక హోర్డింగ్ రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారు. మిగిలినవి పోలీస్ స్టేషన్ వద్ద, టెలిఫోన్ ఎక్స్ఛేంజి వద్ద ఉన్నాయి. ఇటీవల భారీ గాలిదుమారానికి టెలిఫోన్ ఎక్స్ఛేంజి వద్ద భవనంపై ఉన్న హోర్డింగ్ పడిపోయింది. అయితే, ఆ హోర్డింగ్ రాడ్లు భవనంపైనే ఆగడంతో ప్రమాదం తప్పింది.

# వర్షం.. అన్నదాతలకు నష్టం



నేలకొండపల్లి : మరమ్మతు చేస్తున్న ఉద్యోగులు



తిరుమలాయపాలెం : ఎదుళ్లచెరువులో గాలిదుమారంతో దెబ్బతిన్న రేకుల షెడ్డు



వైరారూరల్ : రోడ్డుపై విరిగి పడిన చెట్టు

కూసుమంచి/తిరుమలాయపాలెం/నేలకొండపల్లి/ఖమ్మం అర్బన్/వైరా రూరల్: జిల్లాలోని పలు మండలాల్లో గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో రైతులకు నష్టం ఎదురైంది. బుధవారం రాత్రి, గురువారం ఉదయం కూడా వర్షం కురవగా, కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. పలుచోట్ల బొప్పాయి తదితర తోటలకు నష్టం ఎదురైంది. గురువారం అర్ధరాత్రి కూడా వర్షం కురవడంతో మరోమారు రైతుల నెత్తిన పిడుగు పడినట్లయింది. కూసుమంచి మండలంలోని పలుచోట్ల ధాన్యం తడిసి ముద్దవగా.. చేగొమ్మ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొట్టుకుపోయింది. నేలకొండపల్లి మండలం నేలకొండపల్లి, పైనంపల్లి, ముజ్జుగూడెం, సింగారెడ్డిపాలెం తదితర గ్రామాల్లోనూ కాంటా వేసిన ధాన్యం తడిసింది. తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం, మిర్చి పంటలపై టార్పాలిన్ పట్టాలు గాలికి ఎగిరిపోవడంతో పంటలు తడిసాయి. కాగా, ఖమ్మం ఏడో డివిజన్ టేకులపల్లి కేసీఆర్ టవర్స్ సమీపాన రాంబాబు కిరాణం షాపుపై పిడుగు పడింది. దీంతో కొంత సామగ్రి దెబ్బతినగా, ఇంట్లో ఉన్నవారు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. అలాగే, పలు మండలాల్లో గాలిదుమారానికి ఇళ్లపై రేకులు కొట్టుకుపోగా, చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఈమేరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సిబ్బంది రాత్రంతా శ్రమించి పునరుద్ధరించారు. ఇక కొన్నిచోట్ల చెట్లు కూలి రహదారులపై పడడంతో రాకపోకలు నిలిచిపోయాయి.



కూసుమంచి : చేగొమ్మ కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశుల మధ్య వర్షపు నీరు

## కాంగ్రెస్‌లో కష్టపడే వారికే పదవులు



సత్తుపల్లి : అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాగమయి



వైరా : మాట్లాడుతున్న ఎంపీ రఘురామరెడ్డి, పక్కన ఎమ్మెల్యే రాందాస్, నాయకులు

- సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి..
- ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

సత్తుపల్లిటౌన్: కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని కష్టపడి పని చేసేవారికే పదవులు లభిస్తుందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి స్పష్టం చేశారు. సత్తుపల్లిలో శుక్రవారం జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పార్టీ జిల్లా పరిశీలకులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత పహల్గాం మృతులకు నివాళులర్పించాక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ కష్టపడే వారికి పదవుల్లో అన్యాయం జరగదని తెలిపారు. ఇదే సమయాన సిఫారసులతో పదవులు రావని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యాన అమలుచేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని తెలిపారు. పార్టీ జిల్లా పరిశీలకులు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాగమయి మాట్లాడగా పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అలాగే, సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.37 లక్షలతో నిర్మించే పబ్లిక్ టాయిలెట్ల పనులకు శంకుస్థాపన చేశారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, బత్తిని శ్రీనివాస్, అనిల్, కొప్పుల చంద్రశేఖర్, బొడ్డు బొందయ్య, పుచ్చకాయల వీరభద్రం, శేఖర్‌గౌడ్, దోమ ఆనంద్‌బాబు, భాగం నీరజ, గాదె చెన్నారావు, శివవేణు, మందపాటి ముత్తారెడ్డి, అట్లూరి సత్యనారాయణరెడ్డి, సందీప్‌గౌడ్, కమల్‌పాషా, చల్లగుళ్ల నర్సింహారావు, పింగళి సామేలు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, ఉడతనేని అప్పారావు, నారాయణవరపు శ్రీనివాస్, తోట సుజలరాణి పాల్గొన్నారు.

**గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలి**

వైరా: కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సూచించారు. వైరాలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో నాయని రాజేందర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. గుజరాత్, తెలంగాణ రాష్ట్రాల్లో సంస్థాగత నిర్మాణాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నందున పార్టీ శ్రేణులు దృష్టి సారించాలని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు బత్తిని శ్రీనివాస్, పులి అనిల్‌కుమార్, శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డెనారాయణరావు, తలారి చంద్రప్రకాశ్, స్వర్ణ నరేందర్, మంగీలాల్, ఏదునూరి సీతారాములు, బొర్రా రాజశేఖర్, కట్లరంగారావు, సూతకాని జైపాల్, పగడాల మంజుల, దాసరి దానియేలు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆపరేషన్ కగార్' నిలిపివేయండి



ఖమ్మం అంబేద్కర్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడిన సంఘాలు, పార్టీల నాయకులు

వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యాన నిరసన

ఖమ్మంమయూరిసెంటర్: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక హక్కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఖమ్మంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాకి భాస్కర్, రవిమారుత్ ఆధ్వర్యాన మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు కాంగ్రెస్, మాస్‌లైన్, న్యూడెమోక్రసీ, టీజేఎస్ నాయకులు పోట్ల నాగేశ్వరరావు, గోకనపల్లి వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, గోపగాని శంకర్‌రావు మాట్లాడారు. అటవీ ప్రాంతం నుంచి ఖనిజ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం బలగాలతో ఆదివాసీలపై దాడులు చేయిస్తోందన్నారు. ఇకనైనా దాడులు నిలిపేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్టీలు, సంఘాల నాయకులు దేవిరెడ్డి విజయ్, చిర్ర రవి, కిషన్ నాయక్, స్వర్ణ సుబ్బారావు, డాక్టర్ ఎం.ఎఫ్ గోపీనాథ్, డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, యలముడి కృష్ణయ్య, అశోక్, దాసరి శ్రీను, ఝాన్సీ, పోటు కళావతి, లింగాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

### టీ-20 మహిళా క్రికెట్ టోర్నీలో ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్: కర్ణాటక రాష్ట్రం ఉడిపిలో ఇటీవల జరిగిన మహిళా టీ-20 క్రికెట్ టోర్నీలో తెలంగాణ రాష్ట్ర జట్టు రన్నరప్‌గా నిలిచింది. జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన జిల్లా క్రీడాకారిణి జట్టు విజయంలో కీలకంగా నిలిచి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికైంది. అలాగే, జట్టు కోచ్ ఝాన్సీ, క్రికెటర్ రాధిక జిల్లా వాసులేనని మహిళా క్రికెట్ అసోసియేషన్ ప్రీమియర్ లీగ్ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ తెలిపారు.



రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న కెప్టెన్ అనిత

### సింగరేణిలో రూ.5లక్షల విలువైన కాపర్ వైరు చోరీ

- పక్కా సమాచారంతో పట్టుకున్న సిబ్బంది

కారేపల్లి: సింగరేణి సంస్థలో చోరీ చేసిన కాపర్‌వైరును వాహనంలో తరలిస్తుండగా సంస్థ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. కారేపల్లి మండలంలోని సోలార్ ప్లాంట్ వద్ద శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఇల్లెందులో పాత ఇనుప సామగ్రి దుకాణం నిర్వహిస్తున్న ఓ జాతీయ పార్టీ నాయకుడి బొలేరో వాహనంలో శుక్రవారం రూ.5 లక్షల విలువైన కాపర్ వైర్ ఖమ్మం వైపు తీసుకెళ్తున్నారు. కొన్నాళ్ల కిందట ఈ వైరు చోరీ కాగా, సదరు దుకాణంలోనే ఉందని సంస్థ సిబ్బందికి సమాచారం అందింది. దీంతో కాపు కాసిన వారు వాహనంలో తరలిస్తుండగా అడ్డుకుని వాహనం, వైర్‌ను కారేపల్లి పోలీసులకు అప్పగించారు. దీంతో సదరు షాప్ యజమానితో పాటు ఇంకొకరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే, కాపర్ వైర్‌ను సదరు షాపు బాధ్యులే చోరీ చేయించారా, లేక ఎవరైనా చోరీ చేసి విక్రయించారా అన్న కోణంలో విచారణ నిర్వహిస్తున్నారు.

### హారన్ ఎందుకు కొట్టావన్నందుకు దాడి

చింతకాని: మండలంలోని మత్కేపల్లికి చెందిన సోంపోగు కోటేశ్వరరావుపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. గ్రామానికి చెందిన కొమ్ము వెంకటనారాయణ ఇంటి వద్దకు గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్లిన కోటేశ్వరరావు హారన్ కొట్టాడు. శబ్దం ఎందుకు చేస్తున్నావని ప్రశ్నించగా వెంకటనారాయణను అసభ్య పదజాలంతో దూషిస్తూ కొట్టి చంపుతానని బెదిరించాడు. అడ్డొచ్చిన ఇంకొందరిని కూడా దూషించడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

### ఏపీ వాసి అదృశ్యం

చింతకాని: ఏపీలోని గుంటూరు జిల్లా తాటికొండ మండలం బండారుపల్లికి చెందిన పి.గోపి కానరాకుండా పోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. బండారుపల్లికి చెందిన శ్రీను తన భార్య, కుమారుడు గోపితో కలిసి నేరడలో మామిడి తోట కాపలాకు రెండు నెలల క్రితం వచ్చారు. మతిస్థిమితం సక్రమంగా లేని గోపి గతనెల 24న బయటకు వెళ్లి తిరిగి రాకపోగా, ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసును ఆశ్రయించారు.

### వరిగడ్డి వామి దగ్ధం

తల్లాడ: మండలంలోని తెలగవరంలో శుక్రవారం సర్వీస్ వైరు తెగిపడి నిప్పంటుకోవడంతో వరిగడ్డి వామి దగ్ధమైంది. భూక్యా నాగు ఇంటి వద్ద 400 కట్టలతో కూడిన గడ్డి వామిపై సర్వీస్ వైరు తెగి పడడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు మంటలు ఆర్పుతూనే వైరా అగ్నిమాపక శాఖ కేంద్రానికి సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకుని పూర్తిగా అదుపు చేశారు. అప్పటికే రూ.50 వేల విలువైన గడ్డి కాలిపోయిందని బాధిత రైతు నాగు తెలిపాడు.

### ఆర్‌ఓబీపై బస్సు, లారీ ఢీ

మధిర: మండలంలోని దెందుకూరు రైల్వే ఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం ఎదురెదురుగా వచ్చిన బస్సు, లారీ ఢీకొన్నాయి. మధిర నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న మధిర డిపో ఆర్టీసీ బస్సును, ఎర్రుపాలెం నుంచి మధిర వైపుకు వస్తున్న సుబాబుల్ లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకున్నా, కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. లారీడ్రైవర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మధిర రూరల్ పోలీసులు తెలిపారు.

### చికిత్స పొందుతున్న జేసీబీ డ్రైవర్ మృతి

నేలకొండపల్లి: రైస్ మిల్లులో బూడిద తొలగించే క్రమాన ప్రమాదానికి గురైన జేసీబీ డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నేలకొండపల్లి మండలంలోని ఓ రైస్ మిల్లులో గత నెల 19న బూడిదను పక్కకు నెడుతుండగా డ్రైవర్ ఉపేందర్ అందులో పడ్డాడు. వేడి కారణంగా గాయాల పాలన ఆయనను ఖమ్మంకు, ఆపై హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కాగా, మృతుడి కుటుంబ సభ్యులతో మిల్లు యాజమాన్యం చర్చలు జరిపినట్లు తెలిసింది.

**రోడ్డు ప్రమాదంలో యువకుడు...**



కోటేశ్వరరావు (ఫైల్)

కామేపల్లి: మరో కొద్దిరోజుల్లో వివాహం జరగాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మండలంలోని బాసిత్‌నగర్‌కు చెందిన సుతారి మేస్త్రీ అద్దంకి కోటేశ్వరావు(28)కు ఇటీవల ఓ యువతితో పెళ్లి నిశ్చయం కాగా, త్వరలో నిశ్చితార్థానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈక్రమాన శుక్రవారం ఆయన ద్విచక్రవాహనంపై జాస్తిపల్లి మీదుగా లింగాల వైపు వెళ్తుండగా జూలూరుపాడు మండలం కక్రివారిగూడెం గ్రామానికి చెందిన ఎం.వినోద్‌కుమార్ అశోక్ లైలాండ్ ఆటో ట్రాలీతో ఎదురుగా ఎదురుగా అతి వేగంగా వస్తూ ఢీకొట్టాడు. ఈఘటనలో కోటేశ్వరరావు తలకు తీవ్రగాయాలు కాగా 108లో ఖమ్మం తరలిస్తుండగానే మృతి చెందాడు. ఈమేరకు కుటుంబంలో విషాదం నెలకొనగా, ఆయన తల్లి ఉప్పలమ్మ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

**వడదెబ్బతో వ్యక్తి...**

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపులకు చెందిన దోరేపల్లి శ్రీను(55) వడదెబ్బతో శుక్రవారం మృతి చెందాడు. వారం రోజులుగా వీస్తున్న వడగాలులతో ఆయన అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. శ్రీనుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

మధిర: మండలంలోని వంగవీడు శివారులో పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మధిర రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి ఆధ్వర్యాన శుక్రవారం తనిఖీ చేపట్టగా పేకాట ఆడుతున్న ఇద్దరు పట్టుబడ్డారు. ఒక బైక్, ఫోన్, రూ.1,200 నగదు స్వాధీనం చేసుకోగా నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది కోట ధర్మ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.